క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి

అమ్రాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రవూఫ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, హనుమంతు, సాయి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలతో వెట్టి చాకిరీ తగదు

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలతో వెట్టిచాకిరీ చేయించడం తగదని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత అన్నారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో డివిజన్ పరిధిలోని ఐకేపీ వీఓఏల జిల్లా సమీక్ష సమావేశం కల్వకుర్తి మండల అధ్యక్షుడు దేవయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ వీఓఏలకు శ్రీనిధి రికవరీతో పాటు అనేక విధాలుగా వారిపై ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దుర్గన్న, వనపర్తి జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, అంజన్న, జంగమ్మ, దేవయ్య, రామస్వామి, శ్రీనివాసులు, మల్లేష్, అరుణ, రాధా, లక్ష్మమ్మ, రాజేందర్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘చెట్ల కొమ్మలు తొలగించాలి’

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ నుంచి మారేడుదిన్నె, మారేడుదిన్నె నుంచి యాపట్ల గ్రామాల బీటీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని లింగాల ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ ఈశ్వర్‌కు ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలబారిన పడుతున్నామని వివరించారు. సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మహేష్‌నాయక్, శంకర్‌యాదవ్, రామ్మోహన్, భాస్కర్, చందూ పాల్గొన్నారు.

జెండా దిమ్మె నిర్మాణానికి భూమి పూజ

లింగాల: మండలంలోని రాయవరంలో మంగళవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో జెండా ఏర్పాటుకు అవసరమైన దిమ్మె నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండల అధ్యక్షుడు గువ్వని నవీన్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాలలో పార్టీ జెండాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విష్ణు, మండల నాయకులు సందీప్, సైదులు, సత్యనారాయణ, శంకర్, ఆనంద్‌రెడ్డి, మహేష్, వంశీ పాల్గొన్నారు.

వినాయ మండప ఏర్పాటుపై వాగ్వాదం

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లిలో ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినాయక మండప ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని మరో వర్గం వారు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తిలు ఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాల వారికి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఇరువర్గాల వారిని శాంతింపజేసి పంపించారు.

కలుపు నివారణపై అవగాహన



తాడూరు: రైతులు సాగు చేసే పంటల్లో వచ్చే వయ్యారిబామతోపాటు కలుపు నిర్మూలనపై అవగాహన కేవీకే పాలెం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఇంద్రకల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వయ్యారి బామ కలుపు వలన కలిగే నష్టాలు నివారణ మార్గాలపై శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ సైదయ్యలు వివరించారు. కేవీకే సిబ్బంది మాధురి, వ్యవసాయ అధికారి సందీప్‌రెడ్డి, ఏఈఓ శ్రీకాంత్ రావేఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఎత్తిపోతల పథకం చేపట్టాలి’

చారకొండ: నల్లమల్ల ప్రాంతంలో చంద్రసాగర్– అమ్రబాద్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ సర్కిల్‌లో అమ్రాబాద్ ఎత్తిపోతల పథకాన్ని సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 30 వరకు కరపత్రాల పంపిణీలో చేస్తూ ప్రజలకు ఎత్తిపోతల పథకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నల్లమల ప్రాంతంలో తాగు, సాగునీరు అందించాలన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎమ్మెల్యేలు పథకంపై చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాసారం అశోక్ గౌడ్, బాలయ్య, ఆంజనేయులు ఉన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



అచ్చంపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు



అచ్చంపేటలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న రక్షిత మహిళా సొసైటీ సభ్యులు

వినాయక ఉత్సవాలకు సిద్ధం



కొల్లాపూర్ పట్టణంలో గణపతి మండపం



నాగర్‌కర్నూల్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయకుడి విగ్రహాలు

సాక్షి, నెట్‌వర్క్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం గణేశుడిని ప్రతిష్ఠించేందుకు ఊరూరా వినాయక మండపాల ఏర్పాటు పనుల్లో నిర్వాహకులు నిమగ్నం అయ్యారు. పలు గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమను పంపిణీ చేశారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ రంగురంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.

■ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను డీఎస్పీ శ్రీనువాసులు పంపిణీ చేశారు. విగ్రహాలను కొనుగోలు చేయడానికి జిల్లా పరిధిలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మట్టి విగ్రహాలతో పాటు రంగు రంగుల ఆకృతులతో వినాయక విగ్రహాలు భక్తులకు దర్శనం ఇస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు, నల్లవెల్లిరోడ్డు, బస్టాండ్ పరిసరాలు ప్రజలతో కిటకిటలాడాయి. విగ్రహాల కొనుగోళ్లతో పాటు పూలు, పండ్ల విక్రయాలు జోరుగా సాగాయి.

■ తిమ్మాజిపేట మండల వ్యాప్తంగా వినాయక మండపాల పనుల్లో యువకులు నిమగ్నం అయ్యారు. వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు ఊరేగింపుగా తీసుకొస్తున్నారు.

■ అచ్చంపేటలో పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని ఎస్‌ఐ విజయభాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. డీఎస్పీ శ్రీనువాసులు హాజరై మాట్లాడారు. యువత భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. విద్యుత్ లైన్లను ఇన్‌చార్జ్ ఏడీఈ ఆంజనేయులు పరిశీలించారు. మండపాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

■ ఊర్కొండలో పలు మండపాలను ఎస్‌ఐ కృష్ణదేవరాయ పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

■ కొల్లాపూర్ పట్టణంలో మండపాలను సిద్ధం చేశారు. పట్టణంలోని పలు కాలనీల్లో వివిధ కాలనీల్లో పండుగ సందడి కన్పించింది.

■ బిజినేపల్లి మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేశారు.



మట్టివినాయక ప్రతిమలతో కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు



ఊర్కొండలో వినాయక మండపాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణదేవ

ఘనంగా అమ్మవారి బోనాలు



కొల్లాపూర్ ముక్కిడిగుండంలో బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం పోచమ్మ, సుంకులమ్మ బోనాలు నిర్వహించారు. తిమ్మాజిపేట మండలంలోని చేగుంట, కోడేరు మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల, జొన్నలబొగుడ, కల్వకోలు, గంట్రావుపల్లి, కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల, అంకిరావుపల్లి, నార్లాపూర్, ముక్కిడిగుండం పోచమ్మ బోనాలు నిర్వహించారు. పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, ఎంగంపల్లితాండా, పెంట్లవెల్లిలో సుంకులమ్మకు, పోచమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఆలయానికి చేరకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



తిమ్మాజిపేటల మండలం చేగుంటలో..



పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్లలో..

యూరియా కొరతపై నిరసన

బిజినేపల్లి: రైతులకు సరిపడా యూరియా అందకుండా కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీజేపీ మండల నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మున్నీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు గుమ్మకొండ భూషయ్య, జాకీర్‌హుస్సేన్, నారాయణాచారి, ఊరుకొండ రఘుబాబు, శ్రీకాంత్‌శర్మ, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



కల్వకుర్తి టౌన్: పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. రోడ్లపైన చెత్త చెదారం తొలగించాలని, మురుగుకాల్వలను శుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా కిరోసిన్ బాల్స్ వేయాలన్నారు. అదేవిధంగా గచ్చుబావి రోడ్డులో వనమహోత్సవంలో భాగంగా డివైడర్ మధ్యలో చెట్లను నాటిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు పార్కులను సందర్శించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న, శివ, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న డీఎంహెచ్‌ఓ

వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం హైవేపై రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారకస్థితిలో పడి ఉన్న యువకుని ప్రాణాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రవికుమార్ నాయక్ కాపాడారు. కల్వకుర్తి మండలం జేపీనగర్‌కు చెందిన యుగందర్ స్కూటర్‌పై వెళ్తా హైవేపై ప్రమాదవశాత్తు కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కల్వకుర్తి నుంచి వంగూరు వైపు వస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రవికుమార్ నాయక్ యువకుడిని గమనించి సీపీఆర్ చేసి స్పృహలోకి వచ్చేవిధంగా వైద్యం అందించారు. వెంటనే 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

చారకొండ: మండలంలోని అగ్రహారం తండాలో తాగునీటి కోసం పైప్‌లైన్ పనులను మంగళవారం మిషన్ భగీరథ ఏఈ రితీష్ ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో ట్యాంకు నుంచి తాగునీటి సరాఫరాకు పైప్‌లైన్ వేయాలని గ్రామస్తులు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.1.40 లక్షల మంజూరు చేశారు. దీంతో ఏఈ పనులు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్,వార్డుసభ్యులు రూప్ సింగ్, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



ఆశ్రమ పాఠశాల తనిఖీ

లింగాల: మండలంలోని క్యాంపు రాయవరం గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ప్రత్యేకాధికారి, డీఎల్‌పీఓ వెంకట్‌ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. భోజనాన్ని, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ప్రతి విద్యార్థికి నోటు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సరఫరా చేయాలని సూచించారు. రాత్రి సమయంలో ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉండాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి బాలస్వామి, హెచ్‌ఎం లింగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి



కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లి సమీపంలో ఉన్న చెంచు గూడెంలో ఆధార్ క్యాంపును ఏర్పాటు చేయాలని చెంచులు మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ బన్సీలాల్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంచు గూడెంలో నివాసం ఉంటున్న చెంచులకు ఆధార్ కార్డులు, పెన్షన్లు, రేషన్ కార్డులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని క్యాంపును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెంచులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ



కల్వకుర్తి రూరల్: హైదరాబాదులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. మొత్తం రూ.6.50 లక్షల విలువ చేసే చెక్కులను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులతోపాటు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ.5000 వేలు సమకూర్చడంతో మంగళవారం మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్దన్ బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. విజయ్ గౌడ్, భావండ్ల మధు ఉన్నారు.

ప్రజా సమస్యలపై సర్వే

ఉప్పునుంతల: మండలంలోని రాయిచెడ్‌లో ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కేసుమల్ల సైదులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రాయిచెడ్‌లో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు



చెన్నపురావుపల్లిలో ..

చెన్నపురావుపల్లిలో..

పెద్దకొత్తపల్లి: మండలంలోని చెన్నపురావుపల్లిలో నెలకొన్న సమస్యలపై సీపీఎం నాయకులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి దశరథం చెదురుబావిని పరిశీలించారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రాంబాబు, వెంకటస్వామి, లక్ష్మి, మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి పొందిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మంతటి ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. మండలంలోని పెద్దాపూర్, తుడుకుర్తిలో వేలాడుతున్న తీగల వద్ద నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాసులు, వెంకటయ్య, కృష్ణయ్య, బాలస్వామి, మల్లయ్య, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించాలి

కందనూలు: విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎం మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన బోధన చేసేందుకు టీఎల్‌ఎం మేళాలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తీసుకొచ్చిన టీఎల్‌ఎంను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేశారు. తహసీల్దార్ తబితారాణి, మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కురుమయ్య, లత, శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, వివిధ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలి

దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత డీఈఓ కార్యాలయ ప్రాంగణంలో భవితా కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎంఈఓ భాస్కర్ రెడ్డి, వెంకటయ్య, కిరణ్ కుమార్, ఫిజియోథెరపీ డాక్టర్ ఆనంద్ కుమార్, దివ్యాంగ బాల బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

తెలకపల్లి: విద్యార్థుల సామర్థ్యాలను పెంచి విద్యా ప్రమాణాలను పెంచాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళా నిర్వహిచారు. ఆంగ్లం, తెలుగు, గణిత పాఠ్యాంశాలను ప్రదర్శించారు. గెలుపొందిన పాఠశాలలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శోభన్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్‌లో గ్రామ పంచాయితీ స్వచ్ఛభారత్ నిధులను అక్రమంగా డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంగళవారం అదనపు కలెక్టర్ దేవసహాయంకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి విషయాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి

తాడూరు: మండలంలోని భలాన్‌పల్లి పాఠశాలలో మంగళవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. అనంతరం పాఠశాలకు బీరువాలను అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, రాగవేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

రక్షిత మహిళా సొసైటీ అధ్యక్షురాలిగా రాధిక

అచ్చంపేట రూరల్: రక్షిత మహిళా సొసైటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీరామదాసు రాధిక, ప్రధాన కార్యదర్శిగా అంజలి, కోశాధికారిగా మాధవితో పాటు కార్యవర్గ సభ్యురాలను ఎన్నుకున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు చేపూరి జయమ్మ తెలిపారు. అలాగే గౌరవ అధ్యక్షురాలిగా చిక్కుడు అనురాధ ఎన్నికయ్యారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

తెలకపల్లి: మండలంలోని కారువంగలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు లావణ్య రమణారెడ్డి పంట పొలాల నుంచి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఏఓ నర్మద మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు సుధారాణి, శ్రీదేవి, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎంటామాలాజిస్టు, ఏఓ నర్మద, ఏఈఓ సంతోష్, అన్వర్‌పాషా, రైతులు లావణ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పెద్దముద్దునూరులో ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ మంగళవారం మాజీ జెడ్పీటీసీ చిక్కొండ్ర శ్రీశైలం అదనపు కలెక్టర్ దేవసహాయానికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ భూములపై సర్వే చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలోని నూతనంగా ప్రారంభించిన ప్రీప్రైమరీ పాఠశాలలకు మరమ్మతుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యాయని డీఈఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల మరమ్మతు కోసం టెండర్ దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని ఆసక్తి కలిగిన వారు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కేసు నమోదు చేయాలి

తాడూరు: జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ఫర్టిలైజర్ దుకాణ యజమాని అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారని దుకాణాన్ని సీజ్ చేసి యాజమానిపై కేసు నమోదు చేయాలని డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, చరణ్‌తేజ, జక్కయ్య, బస్వయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ఊర్కొండ: భూ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించాలని తహసీల్దార్ యూసుఫ్ అలీకి మంగళవారం రైతు కృష్ణయ్య గౌడ్ వినతిపత్రం సమర్పించారు. దేవాదాయ శాఖ అధికారులు అక్రమంగా పాతిన కడిలు తొలగించి న్యాయం చేయాలని కోరారు.

త్వరగా పూర్తి చేసుకోవాలి

ఊర్కొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఊర్కొండపేట, మాదారం గ్రామాలను ఆయన సందర్శించి వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీఓ లక్ష్మణ్, ఏఈ హౌజింగ్ తరుణ్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



విద్యుత్‌ఘాతంతో కాడెద్దు మృతి

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన రైతు జగ్గని వెంకటయ్యకు సంబంధించిన కాడెద్దు విద్యుదాఘాతంతో మృతిచెందింది. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని పేర్కొన్నారు.

నక్కలపల్లిలో..

పెద్దకొత్తపల్లి: నక్కలపల్లి గ్రామానికి చెందిన మొట్టి చిన్న నర్సింహకు సంబంధించిన కాడె ఎద్దు మంగళవారం మృత్యువాత చెందింది. వ్యవసాయ పొలంలో గడ్డి మేస్తూ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: ఒకరికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: లారీ, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామానికి చెందిన నారాయణ జిల్లా కేంద్రానికి వస్తుండగా కేసరి సముద్రం చెరువు అలుగు వద్ద లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న నారాయణకు కాలు, చేతి విరగి తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్రవాహనం అలుగు వద్ద నీటిలో పడింది. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మోతవరి లవ్‌స్టోరీ నటుడికి అభినందన

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతానికి చెందిన యువత సినీ పరిశ్రమలో రాణిస్తూ అచ్చంపేట ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఇటీవల ఓటీటీలో విడుదలైన మోతవరి లవ్ స్టోరీ సినిమాలో నటించిన లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామానికి చెందిన చిరుత బాలరాజును మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే అభినందించారు. బాలరాజును ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, నాయకులు ముడావత్ రాములు నాయక్, అంకూరి వెంకటయ్య, రాములు, నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్ నాయక్, రవి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీకృష్ణను అభినందిస్తున్న నటుడు చిరుత బాలరాజు